

ధర్నాలో పాల్గొన్న రవాణారంగ కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి

- రవాణారంగ డ్రైవర్ కార్మికుల సంక్షేమ బోర్డు సాధన సమితి ధర్నా

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రవాణారంగ డ్రైవర్ కార్మికుల సంక్షేమ బోర్డు సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రవాణారంగంలో ఉన్న ప్రతి డ్రైవర్‌కు ప్రత్యేక గుర్తింపును కార్మికశాఖ కల్పించాలని, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమితి ప్రధానకార్యదర్శి కొడ సతీష్, అధ్యక్షులు బి.రవిగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ లెక్కల ప్రకారం నైపుణ్యం కలిగిన కార్మికులు 12 లక్షల మంది ఉన్నారని, అనధికారికంగా 8 లక్షలు ఉన్నారని, వీరిమీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు సుమారు 60 లక్షలుంటాయన్నారు. రోజులో వీరిపని సుమారు 18 గంటలు అని వీరిద్వారా దేశ ఆర్థిక జీడీపీ 4.1 శాతం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వివిధ పన్నుల ద్వారా వస్తున్న ఆదాయం సుమారు రూ.2వేల కోట్లు అన్నారు. డ్రైవర్ కార్మికుల సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలని, డ్రైవర్లకు సోషల్ సెక్యూరిటీ ఏర్పాటులో ప్రత్యేకంగా డ్రైవర్ సంఘాలతో ఆలోచనలు పంచుకోవాలన్నారు. 2024లో అయిపోయిన ప్రమాదబీమా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కమిషనర్ చంద్రశేఖరంను కలిసి వినతిపత్రం సమర్పించారు. సమితి నాయకులు మహేష్, తిరుపతి, స్వామి, కొండల్‌రెడ్డి, రాజు, శ్రీకాంత్, ప్రేమ్‌చందర్, నరసింహ, రఘుపాల్, అలీఫ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి హౌస్ అరెస్ట్



సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన చలో ఈడీ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టారు. దీంతో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని లేనిపక్షంలో పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి.

మే 3న ఆప్ రాష్ట్రస్థాయి సదస్సు



సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, పార్టీ నేతలు

కవాడిగూడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నల్గొండ టౌన్‌లో మే 3వ తేదీన జరిగే ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సదస్సును విజయవంతం చేయాలని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ విజ్ఞప్తి చేశారు. శనివారం దోమలగూడలోని ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆమ్‌ఆద్మీపార్టీ నేతలు బుర్రా రాముగౌడ్, ఎండీ మజీద్, డాక్టర్ అన్సారీ, జావిద్ షరీఫ్, అద్దంకి రవీందర్, దర్శనం రమేష్, అబ్దుల్, నలాంచ మోమిన్, శివాజీ, రాజమల్లయ్య, అజీమ్‌బేగ్, షాబాజ్, నాగార్జున, అంజన్న, ధర్మేంద్రతివారి, కొడంగల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల లీలా కల్యాణ మహోత్సవం

చిక్కడపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి బాపునగర్‌లోని రాజరాజేశ్వరి దేవాలయం వార్షికోత్సవం సందర్భం శనివారం వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శివపార్వతుల లీలాకల్యాణ మహోత్సవం, జయాది హోమం, మహాపూర్ణాహుతి, మహేశ్వర ఘణ ఆశీర్వచనం, కల్యాణ శివ పార్వతుల ఉత్సవ మూర్తుల గ్రామ సందర్శనం(ఊరేగింపు), వీరపురంతులచే నందికోల సేవ నిర్వహించారు.

'టెక్ మహీంద్రా' ఉచిత కంప్యూటర్ శిక్షణ



నిరుద్యోగులకు ఉచిత శిక్షణపై వివరిస్తున్న అప్సా, టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఉద్యోగులు

రాంనగర్/ముషీరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): టెక్ మహీంద్రా ఫౌండేషన్, అప్సా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో టెక్ మహీంద్రా స్మార్ట్ ఉపాధి శిక్షణా కేంద్రం శనివారం రాంనగర్ మీ సేవ వద్ద నిరుద్యోగులకు అవగాహన, దరఖాస్తుల స్వీకరణ శిబిరం నిర్వహించారు. తమ వద్ద ఉన్న ఉచిత ఉపాధి నైపుణ్య కోర్సులపై నిరుద్యోగులకు వివరించి, ఆసక్తి ఉన్న యువతీయువకుల పేర్లను నమోదు చేసుకున్నారు. అప్సా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ మౌలా మాట్లాడుతూ టాలీ, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ టైపింగ్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ కల్పించి నూరు శాతం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న అప్సా, టెక్ మహీంద్రా స్మార్ట్ శిక్షణా కేంద్రానికి నేరుగా లేదా 9154990133, 8498089786 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని ఆయన కోరారు. కార్యక్రమంలో అప్సా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్‌మౌలా, శిక్షణ సిబ్బంది భాస్కర్, జయశ్రీ, చందన, మేఘన విద్యార్థులు పాల్గొన్నారు.

సూక్ష్మజీవి కవితల సంపుటి ఆవిష్కరణ



సూక్ష్మజీవి కవితల సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

రాంనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నెల పిట్ట ప్రచురణ సంస్థ ఆధ్వర్యంలో యువరచయిత బాలు అగ్నివేష్ రచించిన సూక్ష్మజీవి కవితల సంపుటి ఆవిష్కరణ శనివారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కవితల సంపుటిని బాలు అగ్నివేష్ తల్లిదండ్రులు శంకర్, లత ఆవిష్కరణ ప్రముఖ కవి యాకూబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కవిత్వం మనిషికి ఉన్నత కీర్తిని అందిస్తుందన్నారు. యువతరం కవిత్వంలోకి రావడం ఆశాజనకం అన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరేష్ కుమార్ సూఫి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గొప్ప కవిత్వాన్ని అలతిపదాలతో బాలు రాశారని అన్నారు. ఈ సభలో వక్తలు రోజారాణి, వేణు తదితరులు తమ అభిప్రాయాలను వివరించారు.

'చిత్రపురి' అక్రమాలపై విచారణ చేయాలి

- కో ఆపరేటివ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావును సస్పెండ్ చేయాలి
- బాధితుల ధర్నాలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఆప్, సేవాలాల్ సేన నేతలు



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న చిత్రపురి బాధితులు తదితరులు

కవాడిగూడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చిత్రపురి అవినీతి అక్రమాలపై విచారణ చేయాలని పలుపార్టీల నేతలు, బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్రపురి కాలనీలో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు అన్యాయం చేస్తున్న కో ఆపరేటివ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావును వెంటనే సస్పెండ్ చేయాలని, రాష్ట్ర సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. చిత్రపురి రూ.3వేల కోట్ల పెద్దస్కామ్ (భూమి విలువతో) నవోదయం పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ నవోదయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.శివశంకర్ పటేల్, చిత్రపురి సాధన సమితి నాయకులు భద్ర, కస్తూరి శ్రీనివాస్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసే పనులకు విరుద్ధంగా రాష్ట్రంలో రఘునందన్‌రావు చెడ్డ పేరు తీసుకువస్తున్నారని ఆరోపించారు. యాక్ట్ 51 ఎంక్వైయిరీ రిపోర్ట్ వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతోందని, మాధవరెడ్డి రిపోర్ట్ వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా తెలంగాణ ఉన్నత న్యాయస్థానం నాలుగు సంవత్సరాలుగా ఆదేశాలు ఇస్తూనే వస్తుందని అన్నారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కూడా రఘునందన్‌రావు తప్పుదోవ పటిస్తున్నారని, చిత్రపురి అవినీతికి ప్రధాన కారకులైన వల్లభనేని అనిల్‌కుమార్‌ను పెంచి పోషిస్తున్నారని, వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి వీరిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టు ఆర్డర్స్ పాటించకుండా కో ఆపరేటివ్ అధికారులు చిత్రపురి అవినీతి కమిటీతో కుమ్మక్కై పే సినీ కార్మికులను మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు. అవినీతి కమిటీని వెంటనే సస్పెండ్ చేసి అడహక్ కమిటీ వేసి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎంక్వైయిరీ చేయాలని డిమాండ్ చేశారు. సినిమా పేద కార్మికులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపకార్యదర్శి నరసింహ, సీఐటీయూ నాయకులు కుమార్, ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్‌దిడ్డి సుధాకర్, చిత్రపురి సాధన సమితి అధ్యక్షులు కస్తూరి శ్రీనివాస్, నాయకులు సంకూరి రవీందర్, ప్రసాద్, రమావేణి, ఉమ, జయచ లలిత, రాజు, సాంబశివరావు, బాధితులు పాల్గొన్నారు.

అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ప్రారంభం

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ తొలిసారిగా అండర్‌గ్రాడ్యుయేట్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో శనివారం ప్రారంభించింది. ఎంట్రప్రెన్యూర్‌షిప్ విద్యను కొత్త విధానంలో రూపొందిస్తున్న బోవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ తన అండర్‌గ్రాడ్యుయేట్ ఎంప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. మూడు సంవత్సరాల వ్యవధితో రూపొందిన ఈ కార్యక్రమం భవిష్యత్ ఎంప్రెన్యూర్‌లను తీర్చిదిద్దడానికి ఉద్దేశించిందని నిర్వాహకులు పవన్ అలీనా ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన దేశనిర్మాణంలో భవిష్యత్ పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడం అనేఅంశంపై చర్చ ఆసక్తికరంగా సాగింది.

నేడు గానవిభావరి

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్వరఝురి భువన భాస్కర సంగీత సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉషోదయా స్టూడియోలో గానవిభావరి నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయని, నిర్వాహకురాలు భువన రాధారాణి తెలిపారు. ప్రముఖ గాయకులు టీవీఎస్ రావు ఆశీస్సులతో జరిగే కార్యక్రమంలో ఉషోదయా ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ ఉషారాణి, మధురగాయకులు యజ్ఞప్రసాద్ అతిథులుగా పాల్గొంటారని వివరించారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆ పార్టీ యువనేత జైసింహ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ముదారపు రాకేష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం డివిజన్‌లోని జవహర్‌నగర్‌లో వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ సభ వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గోపాల్, జైసింహ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఎర్రం శ్రీనివాస్‌గుప్త, పాశం రవి, పోతుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏసుప్రభు చూపిన బాటలో నడుచుకోవాలి

ముషీరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు నేర్పిన సేవ, దయ మానవాలికి స్ఫూర్తిదాయకం అని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం వివిధ చర్చిల నుంచి ఈస్టర్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులు ఐక్యతను ఆకాంక్షిస్తూ ర్యాలీ నిర్వహించారు. ముషీరాబాద్, పార్శీగుట్ట, రాంనగర్, వీఎస్‌టీ, ఇందిరా పార్కు నుంచి ఆబిడ్స్‌లోని సేయింట్ జాన్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జైసింహ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నేతలు డెనియల్, గోని సాల్మాన్, జయకుమార్, ఆర్ మోజెస్, టోని, జాయ్, భాస్కర్, ప్రేమ్‌సాగర్, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, కృపావరం తదితరులు పాల్గొన్నారు.

టిఫ్ సహకార కేంద్రంగా నగర ఆస్పత్రి

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ(టీఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో పనిచేస్తున్న నగరంలోని శివరామ్‌పల్లికి చెందిన కమల హాస్పిటల్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ తలసేమియా అండ్ సికిల్‌సెల్ డిసీజ్ మన దేశంలోని ప్రతిష్ఠాత్మక తలసేమియా ఇంటర్నేషనల్ ఫెడరేషన్(టిఫ్) సహకార కేంద్రాల్లో ఒకటిగా అధికారికంగా నియమించబడిందని టీఎస్‌సీఎస్ ఉపాధ్యక్షులు రితేష్ దేవ్డా, శివరతన్, రత్నావళి కొత్తపల్లి, అధ్యక్షులు డా.చంద్రకాంత్ అగర్వాల్, కార్యదర్శి డా.సుమన్ జైన్, సంయుక్త కార్యదర్శి అలీమ్‌బేగ్, మహ్మద్ అమీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రొ.ఆంటోనియో పిగా, ప్రొ.డిమిత్రియోస్ ఫార్మాకిస్‌తో కూడిన నిపుణుల బృందం అధికారిక ఆన్‌సైట్ పరిశీలన చేసిందన్నారు. వారి పరిశీలనలో కమలా హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్, ఎయిమ్స్(న్యూఢిల్లీ) ఉన్నట్లుగా తేలిందని వివరించారు. టిఫ్ సహకార కేంద్రాల నెట్‌వర్క్ అనేది తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధి సమస్యలతో పోరాడుతున్న దేశాల్లో సంరక్షణ, విద్య, మానవ వనరులలో నిరంతర సహకారాన్ని అందించడానికి ఏర్పాటు చేసిన ప్రతిష్ఠాత్మక వేదిక అని వారు వివరించారు.

కెమెరాలతో ప్రేక్షకులను ముగ్ధులను చేసిన రఘు

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తన నైపుణ్యంతో కెమెరా కన్నులతో పలు సినిమాలకు ఛాయాగ్రాహకుడిగా పనిచేసిన రఘు ప్రేక్షకులను ముగ్ధులను చేశారని ప్రముఖ సినీ, టీవీ నటులు సుబ్బరాయశర్మ అన్నారు. వీ మీడియా క్రియేషన్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఎంవీ.రఘు 80ఏళ్ల సినీ జీవిత ప్రయాణం పూర్తి అయిన సందర్భంగా సన్మానసభ జరిగింది. సుబ్బరాయశర్మ మాట్లాడుతూ విజయవాడ ఎస్ఎస్ఆర్ కళాశాల నుంచి విశ్వనాథ సత్యనారాయణ, ఎన్‌టీఆర్, జంధ్యాల వంటి పలువురు ప్రతాభావంతులు వచ్చారని, వారిలో రఘు ఒకరు అన్నారు. ప్రముఖ నటుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ రఘు ఛాయాగ్రహణం చేసిన సితార, మగమహారాజు, సిరివెన్నెల, స్వాతిముత్యం, సంసార్ వంటి సినిమాలు బాక్సాఫీస్ హిట్లు అన్నారు. రామరాజు, కవి కామేశ్వరరావు, నటి విజయలక్ష్మి, కళాపోషకుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.

మహ్మద్ గౌస్‌కు నివాళి

రాంనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వర్గ సామాజిక అసమానతలు లేని రాజ్యం స్థాపనే ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ అమరత్వం పొందిన మహ్మద్ గౌస్‌కు ఇచ్చే నివాళి అని వక్తలు పేర్కొన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఎంసిపిఐయు కార్యాలయంలో గౌస్ వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నారగోని రవి, వనం సుధాకర్, రమేష్, అనిల్, తుకారామ్, పుష్ప, కళావతి, దశరథ్, భాగ్యమ్మ, దానయ్య, లక్ష్మణ్, మధుసూదన్, శ్రీనివాస్, రవీందర్, శివాని, అమీనా బేగం, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన వరదనీటి పైప్‌లైన్ పనులు



ఎస్‌వీకే వద్ద వరదనీటిపైప్‌లైన్ కోసం తవ్విన గొయ్యి

రాంనగర్ , ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద వర్షపునీరు నిలిచి ఉండకుండా నీరు సాఫీగా నాలాలోకి వెళ్లేందుకు జీహెచ్ఎంసీ ఎస్ఎన్‌డీపీ విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వర్షపునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ఈ మార్గంలో నెల రోజులుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే కార్యక్రమాలకు హాజరయ్యే వక్తలు, ముఖ్య అతిథులు తమ వాహనాలను పార్కింగ్ చేయడానికి దారిలేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. పైప్‌లైన్ వేసేందుకు తవ్విన భారీ గొయ్యిలకు ఎలాంటి రక్షణ చర్యలూ లేకపోవడంతో మనుషులు అందులో పడే ప్రమాదం ఉంది. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అధికారులు పర్యవేక్షణ చేయకపోవడ వల్లే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. నిత్యం వేలాది మంది సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఎదురుగా ఉన్న రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలను పాటిస్తూ క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని సుందరయ్య పార్కు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ.నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం సుందరయ్య పార్కులో కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, మురళీకృష్ణ, డాక్టర్ సునీల్, సైలాబ్ బాబు తదితరుతలు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలి

దక్షిణాది రాష్ట్రాల జేఏసీ ఛైర్మన్ ప్రొ.వినోద్ కుమార్



ధర్నాలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

కవాడిగూడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 1977 సంవత్సరంలో ప్రవేశపెట్టిన పీఓటీ చట్టాన్ని రద్దు చేసి అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలని దక్షిణాది రాష్ట్రాల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అసైన్డ్ భూముల హక్కుల సాధనకు మహాధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ప్రొ.గాలి వినోద్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అసైన్డ్‌లో రిజిస్టర్ కాని అసైన్డ్ భూములను వెంటనే అసైన్డ్ చేయాలని డిమాండ్ చేశారు. అన్యాంతక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి అసైన్డ్ దారులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మురికివాడలలో నివసిస్తున్న పేదల ఇళ్లకు యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివయ్య, ఉపాధ్యక్షుడు బింగి రాములు. రుద్రారం శంకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు చింతా సాంబమూర్తి, తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు, మాజీ సర్పంచులు, కుల సంఘాల నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

నూతన స్లాట్ బుకింగ్‌ను రద్దు చేయాలి

- మూతపడ్డ డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు
- చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొచ్చిన స్లాట్‌బుకింగ్ సిస్టమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం అశోక్‌నగర్‌లోని చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన నిర్వహించారు. అయిదు రోజులుగా ధర్నా, నిరసన తెలుపుతున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. నూతన స్లాట్ బుకింగ్ విధానాన్ని నిరసిస్తూ డాక్యుమెంట్ రైటర్లు తమ కార్యాలయాలను మూసివేశారు. పెన్‌డౌన్ నిర్వహించారు. ఎలాంటి డాక్యుమెంట్ రైటింగ్ పనులు చేయలేదు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు ఎస్ఎం.శ్రీనివాస్, కెగిరిబాబు, లైఖ్‌ఉల్లాహ్, అశోక్, పులిరాజు, ఈశ్వర్, రాజు, జ్ఞానేశ్వర్, సురేష్‌యాదవ్, జి.అబ్బయ్య మొగులు రమేష్, రాంపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్లను బతకకుండా చేయడమే పనిగా ప్రభుత్వం, యంత్రాంగం చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. రిజిస్ట్రేషన్‌ల విషయంలో పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డాక్యుమెంట్‌రైటర్లు సునీల్, అబ్బయ్యగౌడ్, రూపాదేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు సేవా కార్యక్రమాలు: టీడీపీ

నల్లకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ పేర్కొన్నారు. శనివారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.కృష్ణ; పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎల్.పద్మ, ప్రవీణ్ తదితరులు

నల్లకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకువచ్చిందని, ఇది కార్మిక వర్గానికి తీవ్ర నష్టపరిహారం అని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) నేతలు ఎస్ఎల్.పద్మ, బి.ప్రవీణ్ పేర్కొన్నారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, పనిగంటల పెంపును మానుకోవాలని, ఈపీఎఫ్ లబ్ధిదారులకు కనీస పెన్షన్ రూ. 9 వేలకు కల్పించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 20న దేశవ్యాప్త కార్మికవర్గ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. డిసెంబర్ 10 నుంచి జనవరి 6 వరకు కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి కోత విధించిన జీతాలను మంజూరు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నేతలు లింగంగౌడ్, ఎస్.శ్రీనివాస్, డి.లక్ష్మి, ప్రభాకర్, అఫ్జల్, సత్యనారాయణ, విష్ణు, శివరంజని, విజయకుమార్, వెంకటేష్, ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని అడ్డుకుంటాం: టీపీసీసీ

నల్లకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జి.కిషన్‌రెడ్డి రెండుమార్లు కేంద్ర మంత్రిగా ఉన్నా తెలంగాణ రాష్ట్రానికి ఏం చేశారని టీపీసీసీ కార్యదర్శి ఎన్.అజయ్‌కుమార్, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ ఛైర్మన్ కట్టెల సుభాష్, ఓబీసీ సెల్ సలహాదారు ఎన్.శ్రీకాంత్ ప్రశ్నించారు. దేశం కోసం తమ జీవితం త్యాగం చేసిన గాంధీ కుటుంబంపై కిషన్‌రెడ్డికి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. ప్రధాని మోదీ గాంధీ కుటుంబంపై ఈడీ కేసులతో కేసులు వేసిన నేపథ్యంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ధర్నాలు, ఆందోళనలు చేయడం తగదన్నారు. శనివారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ దిష్టిబొమ్మలను బీజేపీ నేతలు దహనం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అంజన్‌కుమార్‌యాదవ్‌పై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఏ మాత్రం ఊరుకోరన్నారు. అవసరం అయితే రాష్ట్రంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఎక్కడ పర్యటించినా అడ్డుకుంటారని వారు హెచ్చరించారు.

బడీడు పిల్లలను పాఠశాలలకు పంపించాలి



మాట్లాడుతున్న డీసీపీయూ అధికారి శ్రీనివాస్

ముషీరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలు పెడదారి పట్టకుండా తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీయూ) ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ సిద్ధిక్‌నగర్‌లో రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ ఆధ్వర్యంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమ్యూనిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు వాటర్‌బాటిల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీబీసీ ప్రోగ్రామ్ మేనేజర్ క్రాంతి కిరణ్, నాయకులు మున్వర్‌చాంద్, మగ్దూమ్, అజీపాషా, షకీల్ అహ్మద్, పర్వేజ్ కురేషీ, ఎస్ఆర్‌డి సంస్థ ప్రతినిధులు శివరాణి, ఇందిరాభారతి తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ వ్యాపారి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాంనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ ఫైనాన్సర్‌ను హత్య చేసి, పరారైన నిందితున్ని ముషీరాబాద్‌పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 4న ఫైనాన్స్ వ్యాపారి సత్నంసింగ్(59) హత్య కేసును పోలీసులు దర్యాప్తు చేశారు. సత్నంసింగ్ అప్పు తీర్చమని నయన్‌చంద్రానాయక్ ఇంటికెళ్లాడు. దీంతో కత్తితోపొడిచి, మృతదేహాన్ని సంపులో పడేసి, అతని మెడలోని నగలను తీసుకొని ఒడిశాకు నయన్ పరారయ్యాడు. అక్కడి నుంచి గోవాకెళ్లి, నగలు అమ్మేశాడు. డబ్బులు అయిపోయాక శనివారం మధ్యాహ్నం సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు. నిఘాపెట్టిన పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లి, చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్ పర్యవేక్షణలో సీఐ రాంబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. పోలీసు సిబ్బందిని డీసీపీ, ఏసీపీ అభినందించారు.